


2



2




AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## సీఎం సలహాదారుడిని కలిసిన నేతలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నగేష్ రెడ్డి, నగరాధ్యక్షుడిగా బొబ్బిలి రామకృష్ణ ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం రాష్ట్ర సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా రాజకీయాలపై చర్చించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గన్ రాజ్, పంచరెడ్డి చరణ్ పాల్గొన్నారు.


19-12-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## 22న ప్రయోగాత్మకంగా 'టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్'

**అక్షరటుడే, ఇందూరు:** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఈనెల 22న జిల్లాలో ప్రయోగాత్మకంగా 'టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్'ను నిర్వహించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. మాక్ ఎక్సర్‌సైజ్ చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడారు. అకస్మాత్తుగా సంభవించే విపత్తులను ఎదుర్కొనేందుకు అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విపత్తు నిర్వహణ విషయంలో అప్రమత్తతను పెంపొందించేందుకు మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించాలని ఆదేశించిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, జడ్పీ సీఈవో సాయ గౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, కలెక్టరేట్ విపత్తుల నిర్వహణ విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సోమార్‌పేట్ ఘటన బాధితుల వైద్యఖర్చులు భరిస్తా..: మాజీ ఎంపీ




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోమార్‌పేట్‌లో జరిగిన ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులకు వైద్యానికి సాయమందిస్తానని మాజీ ఎంపీ బీబీపాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మ, సత్తెమ్మను శుక్రవారం మాజీ ఎంపీ బీబీ పాటిల్ పరామర్శించారు. వారిని ఓదార్చి ఆస్పత్రి వైద్యానికి అయ్యే ఖర్చులు మొత్తం తానే భరిస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ కక్షలతో ఇలాంటి దారుణాలకు ఒడికట్టవద్దన్నారు. స్నేహపూర్వక రాజకీయాలు చేయాలని పేర్కొన్నారు. ఒకే ఊళ్లో కలిసి బతికే వాళ్లమని.. ఎన్నికల సమయంలో మాత్రమే పోటీపడాలి తప్ప కక్షలకు పోవద్దని హితవు పలికారు.

## సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలో కొత్త సర్పంచులు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ ఛైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గెలిచిన సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సర్పంచులను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి నూతన సర్పంచులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సబ్దల్‌పూర్ సర్పంచ్ స్వప్న సాయిలు, మల్లయ్యపల్లి సర్పంచ్ లక్ష్మి మైసయ్య, రేపల్లెవాడ సర్పంచ్ దుద్దుల వనిత సాయిరాం, అల్మాజీపూర్ సర్పంచ్ దత్తు, దవల్ మల్కపల్లి సర్పంచ్ దీవెన రవీందర్ ఉన్నారు.

# పీఎంపీల కమీషన్ల దందా..



- ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులను పంపుతున్న వైనం
- కమీషన్లు ఇస్తున్న యాజమాన్యాలు
- అవసరం ఉన్నా లేకున్నా పరీక్షలు, ఆపరేషన్లు

కామారెడ్డి పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వైద్య రంగంపై కనీస అవగాహన లేని వారు సైతం ఆస్పత్రులు ప్రారంభిస్తున్నారు. వైద్యులను రప్పించి చికిత్సలు చేస్తున్నాయి. మెడికల్ షాపు బాధ్యతలు మాత్రమే తెలిసిన వ్యక్తులు కూడా డాక్టర్ అవతారమెత్తి రోగులకు ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారు. ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఏడాది కాలంలో పట్టణంలో అనేక కొత్త ఆస్పత్రులు ఏర్పాటయ్యాయి. ఇందులో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

### 30 నుంచి 40 శాతం కమీషన్

జిల్లాలో సుమారు 150కి పైగా పీఎంలు ఉన్నారు. వీరు పల్లెల్లో ప్రాథమిక చికిత్సా కేంద్రాలు నడుతుపున్నారు. అయితే పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీనియర్ వైద్యుల వద్ద చికిత్స నేర్చుకున్న కొందరు పీఎంపీలు అదే ఆస్పత్రికి రోగులను తరలిస్తున్నారు. మరికొందరు కమీషన్లకు కక్కుర్తి పడి ఎక్కువ కమీషన్ ఇచ్చే ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. పట్టణంలో పేరుమోసిన ఆస్పత్రుల యాజమాన్యాలు పీఎంపీలకు రోగికి అయిన బిల్లులో 30 నుంచి 40 శాతం కమీషన్ ఇస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. రోగులకు అవసరం ఉన్నా లేకున్నా పలు రకాల పరీక్షలు రాస్తూ అందులో వచ్చే ఆదాయంలో పీఎంపీలకు కమీషన్ చేరవేస్తున్నారు. దాంతో తమ ప్రాక్టీసుతో పాటు ఈ వ్యాపారం కూడా బాగుండడంతో ఆస్పత్రి యాజమాన్యాలను పీఎంపీలు గుప్పిట్లో పెట్టుకుంటున్నారన్న చర్చ సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండేది పీఎంపీలే కావడంతో.. వారు చెప్పిన ఆస్పత్రులకు ప్రజలు వెళ్తున్నారు.

### అబార్షన్ ఘటనలో..

జిల్లాలో ఇటీవల కలకలం రేపిన అబార్షన్ ఘటనలో సైతం ఓ పీఎంపీ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతడిని పోలీసులు విచారణకు పిలిచినట్లు ప్రచారం సాగుతోంది. సదరు పీఎంపీ లింగ నిర్ధారణ పరీక్షల కోసం డబ్బులు వసూలు చేస్తాడని సమాచారం. తన దగ్గరకు వచ్చే వారి దగ్గర రూ.40 వేలు తీసుకొని స్కానింగ్ చేయిస్తాడని తెలిసింది. తాను రూ.18 వేలు తీసుకొని, స్కానింగ్ సెంటర్‌కు రూ.22 వేలు చెల్లిస్తాడని సమాచారం. ఒకవేళ ఆడిబిడ్డ అని తేలితే అబార్షన్ చేయించుకోవాలి అనుకునే వారికి ఆస్పత్రిని కూడా రిఫర్ చేస్తాడని తెలుస్తోంది. దీంతో అక్కడ కూడా కమీషన్ వస్తుంది.

### అడ్డుకట్ట పడేనా..?

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండేది పీఎంపీ, ఆర్ఎంపీలే. అత్యవసర సమయంలో ఫోన్ చేయగానే చికిత్స చేయడంలో వారు ముందుంటారని చెప్పడంలో సందేహం లేదు. అయితే వారి పరిధి ఎంత వరకు అనేది మాత్రం వైద్యశాఖ అధికారులు నిర్దిష్టంగా చెప్పలేకపోతున్నారు. ఫలితంగా దనార్జనకు అలవాటు పడిన కొందరు పీఎంపీల తీరుతో ప్రైవేట్ ఆస్పత్రులు సామాన్య ప్రజలను దోచుకుంటున్నాయి. పీఎంపీల కమీషన్ల దందా, ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై వైద్యారోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వందశాతం పన్నులు వసూలు చేయాలి: అడిషనల్ కలెక్టర్ అంకిత్



**అక్షరటుడే, బోధన్:** బోధన్ మున్సిపల్ పరిధిలో వందశాతం పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ సిబ్బందికి అడిషనల్ కలెక్టర్ అంకిత్ సూచించారు. బోధన్ మున్సిపాలిటీలో శుక్రవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై చర్చించారు. పన్ను వసూళ్లపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పన్నులు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని సూచించారు. తద్వారా పట్టణంలో అభివృద్ధిపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.

## తెయూ పరిధిలో బీపీఎడ్ పరీక్షల ఫీజు తేదీల విడుదల

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిసెంబర్ 2026 విద్యా సంవత్సరం బీపీఎడ్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదలైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి కె.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బీపీఎడ్ ఒకటో, మూడో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును డిసెంబర్ 27వ తేదీలోపు చెల్లించాలన్నారు. అలాగే రూ.100 పెనాల్టీతో డిసెంబర్ 29వ తేదీలోపు చెల్లించాలని నిబంధన విధించారు. విద్యార్థులు పూర్తి వివరాలకు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, ఇందల్వాయి :** సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సిర్నాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డివిజినల్ ఇంజినీర్ సీహెచ్ హరిచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రానున్న రోజుల్లో అధిక లోడ్‌ను అధిగమించడానికి 5 ఎంవీఏ కెపాసిటీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 2 స్థానంలో 8 ఎంవీఏ కెపాసిటీ ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను బిగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సిర్నాపల్లి, నల్లవెల్లి, డోన్కల్ గ్రామ ప్రజలు సహకరించగలరని ఆయన కోరారు.

## యథావిధిగా ప్రజావాణి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వచ్చే సోమవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# మావోయిస్టు ఎర్రగొల్ల రవి లొంగుబాటు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాకు చెందిన మావోయిస్టు కీలక నేత ఎర్రగొల్ల శుక్రవారం రాష్ట్ర డీజీపీ ఎదుట లొంగిపోయాడు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన రవి అలియాస్ సంతోష్ మావోయిస్టు పార్టీలో కీలక నేతగా పనిచేస్తున్నాడు. ఆయన 2001 సంవత్సరంలో ఇంటర్ చదువుతున్న సమయంలో నాటి పీపుల్స్ వార్ కార్యక్రమాలకు ఆకర్షితుడై ఇంటినుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. నాటి నుంచి దాదాపు పాతికేళ్లుగా ఇంటిముఖం చూడలేదు. చివరికి కన్నతల్లి చనిపోయిన సమయంలో కూడా ఇంటికి రాలేదు. అప్పటినుంచి తండ్రి రామయ్య కొడుకు కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాష్ట్ర డీజీపీ ఎదుట రవి లొంగిపోయాడు. అతనిపై రూ. 5లక్షల రివార్డు ఉన్నట్టుగా పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఎర్రగొల్ల రవి దండకారణ్యంలో కీలక పదవుల్లో కొనసాగినట్లు సమాచారం. ఏవోబీ కమాండర్‌గా పని చేస్తున్న రవి తాజాగా లొంగిపోయాడు.

## కాంగ్రెస్ కార్యకర్తలపై మాజీ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు


**అక్షరటుడే, బోధన్:** కాంగ్రెస్ కార్యకర్తలపై బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కీలక వ్యాఖ్యలు చేశారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యర్తలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదన్నారు. తాము అధికారంలో ఉన్న పదేళ్లు ఏ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టలేదన్నారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు పలువురు బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి సహించేది లేదని తేల్చిచెప్పారు. పార్టీలకతీతంగా అందిరికీ పనులు చేసిపెట్టామన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని.. ఇప్పుడు సతాయించిన వారిని అప్పుడు వదిలిపెట్టే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గిర్ధావర్ గంగారెడ్డి, వీఆర్ దేశాయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ఏనుగు రవీందర్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి: భాస్కర్ రెడ్డి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఏనుగు రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సర్పంచ్ ఎన్నికల్లో ఇతర పార్టీలకు సహకరించారని.. ఆయన అసలు ఏ పార్టీలో ఉన్నారో తేల్చుకోవాలని డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. బాన్సువాడలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 137 పంచాయతీలకు ఎన్నికలు జరగగా 111 మంది కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందారని వివరించారు. ఏనుగు రవీందర్ రెడ్డి మద్దతుగా నిలబెట్టిన వారిలో 16 మంది సర్పంచులు మాత్రమే గెలుపొందారని పేర్కొన్నారు. దీంతో నియోజవర్గంలో ఏనుగు ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఎర్వల కృష్ణారెడ్డి, మోహన్ నాయక్, ఎజాజ్, పిట్ల శ్రీధర్, జంగం గంగాధర్, లింగం, ఉదయ్, శ్రీనివాస్, పాషా తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మైసమ్మ వీధిలో వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. బీజేవైఎం నాయకుడు ఆశిష్ నేత స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పడిపూజ నిర్వహించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, బీఆర్ఎస్ పటాన్‌చెరువు నియోజకవర్గ నేత, ఆర్‌కే ఫౌండేషన్ ఛైర్మన్ కాల్వగడ్డ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. అయ్యప్ప దీక్ష సన్మార్గాన్ని నేర్పిస్తుందని వివరించారు. పసుపుబోర్డు ఛైర్మన్ పల్లెగంగారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంతో దైవ చింతన ఎంతో ముఖ్యమన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. పటాన్‌చెరువు నియోజకవర్గ నేత రాజ్‌కుమార్ మాట్లాడుతూ భక్తి పారవశ్యంతో, అకుంఠిత దీక్షతో స్వాములు 41 రోజులు దీక్ష చేయడం అభినందయనీయన్నారు. అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాజ్ కుమార్‌ను ఎమ్మెల్యే ధన్‌పాల్ సన్మానించారు.



## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

**అక్షరటుడే, జక్రాన్‌పల్లి/ఆర్మూర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పార్టీ నాయకులు శుక్రవారం కలిశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు రాగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలోని పార్టీని మరింత బలోపేత చేసేందుకు కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. అనంతరం నిర్మల్‌కు వెళ్తున్న రాంచందర్ రావుకు ఆర్మూర్‌లో నాయకులు స్వాగతం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్, స్రవంతి రెడ్డి, బీజేవైఎం నాయకులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ గౌడ్, అధికార ప్రతినిధి సంజీవ్ గౌడ్, నాయకులు పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, వేణు, మందుల బాలు, తిరుపతి నాయక్, బాండ్లపల్లి నర్సారెడ్డి, ప్రసన్న గౌడ్, కుమార్, అరుణ్ కుమార్, తొర్లికొండ సర్పంచ్ పద్మ నాగరాజు, వార్డ్ మెంబర్లు కొయ్యల భారతి, పుదరి అరుణ, గడ్డం రూప, ఈర్ల రోజా, అశోక్ మంగళారం తదితరులు ఉన్నారు.

## దినేష్ కులాచారిని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**అక్షరటుడే, ఇందల్వాయి:** బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ కుటుంబాన్ని శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరామర్శించారు. ఈనెల 17వ తేదీన జిల్లా అధ్యక్షుడు దినేష్ చిన్ననాన్న కులాచారి మోహన్ రావు మరణించారు. సమాచారం తెలుసుకున్న రాంచందర్‌రావు శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లికి వచ్చారు. అక్కడ దినేష్ కులాచారి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. ఇలాంటి సమయంలో మనోధైర్యం కోల్పోకుండా నిబ్బరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## మొబైల్ యాప్ ద్వారా యూరియా కొనుగోళ్లు

**అక్షరటుడే, ఇందల్వాయి:** రైతులు మొబైల్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఇందల్వాయి మండలం వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చంద్రాయన్ పల్లిలో శుక్రవారం ఎరువుల గోదాంను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శనివారం నుంచి రైతులకు కావాల్సిన యూరియా మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ఐదెకరాల్లోపు రైతులు రెండు దఫాలుగా యూరియా కొనుగోలు చేయవచ్చని, 5ఎకరాల పైన ఉన్న రైతులు మూడు దఫాలుగా యూరియా కొనుగోలు చేయవచ్చని వివరించారు. ఆయన వెంట రైతులు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

## లింగంపేటలో అయ్యప్ప ఆరట్టు

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో అయ్యప్ప ఆరట్టు మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం భక్తులందరికీ కన్నె గురుస్వామి గిరిధర్ నాయుడు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రాజిరెడ్డి గురుస్వామి, సతీష్, లక్ష్మా గౌడ్, దత్తు, శ్రీరామ్, రామారావు, పెద్దసంఖ్యలో కన్నె స్వాములు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



## రాములోరి కల్యాణానికి తలంబ్రాలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** పట్టణంలోని వైశ్యభవన్ లో మహిళలు భద్రాద్రి సీతారాముల కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మహిళలు సీతారాముల పాటలు పాడుతూ చేతితో వడ్ల గింజలను ఒలుస్తున్నారు. ఈ సందర్భంగా మహిళ ప్రతినిధులు పడిగల రమాదేవి మాట్లాడుతూ.. 2026లో భద్రాద్రి సీతారాముల కల్యాణం కోసం హైదరాబాద్ కొత్తపేట అష్టలక్ష్మీ ఆలయం నుంచి నిర్వాహకులు శ్రీనివాస్ గుప్తా అర కిలో సన్న వడ్లను ఎల్లారెడ్డికి పంపించారన్నారు. ఈ వడ్లను స్థానిక మహిళలు చేతితో ఒలిచి అక్షింతలు సిద్ధం చేసి రెండు రోజుల్లో హైదరాబాద్ కు పంపిస్తామన్నారు. తమకు అక్షింతలు ఒలిచే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. మూడు విడతల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో పల్లెవాకిట కొత్త పాలకవర్గాలు కొలువుదీరేందుకు ముహూర్తం ఖరారైంది. మరికొద్ది రోజుల్లోనే సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించనున్నారు. గ్రామ పరిపాలనలో సర్పంచ్‌ను 'ప్రథమ పౌరుడు'గా, మార్గదర్శిగా పరిగణిస్తారు. అలాగే పల్లె సమగ్ర అభివృద్ధిలో ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర కూడా కీలకమని పంచాయతీరాజ్ చట్టం స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో పాలకవర్గ ప్రతినిధుల విధులు, అధికారాలపై ప్రత్యేక కథనం..**

– అక్షరటుడే, భీమ్‌గల్




## కొత్త సర్పంచ్‌లపై

# బాధ్యతలెన్నో..

■ పల్లె ప్రగతికి సారథులు.. ■ బాధ్యతల్లో భాగస్వాములు ■ అందరిని కలుపుకుని పోతేనే అభివృద్ధి సాధ్యం

### ఉపసర్పంచ్.. కీలకమే..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఉప సర్పంచ్ పాత్ర మరింత బలోపేతమైంది. సర్పంచ్ అందుబాటులో లేని పక్షంలో సమావేశాలకు ఉప సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. సర్పంచ్ పదవి ఖాళీ అయినప్పుడు, కొత్త సర్పంచ్ ఎన్నికయ్యే వరకు ఆ బాధ్యతలు నిర్వహిస్తారు. 'చెక్ పవర్'లో భాగస్వామ్యం కల్పించడంతో ఆర్థిక వ్యవహారాల్లో ఉప సర్పంచ్ పాత్ర కీలకంగా మారింది.

గ్రామ పాలనా రథసారథి సర్పంచ్. పంచాయతీ పరిధిలో సర్పంచ్ అత్యున్నత బాధ్యతలను కలిగి ఉంటారు. ఆయన తన తొలి పాలకవర్గ సమావేశం నుంచి ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. గ్రామ పంచాయతీ సమావేశాలకు, గ్రామసభలకు అధ్యక్షత సర్పంచ్‌దే. ప్రతి రెండు నెలలకోసారి తప్పనిసరిగా పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సిన బాధ్యత కూడా సర్పంచ్‌పై ఉంటుంది.

### గ్రామంలో సంక్షేమంపై..

సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏడాదిలో నిర్వహించే ఆరు సమావేశాల్లో.. కనీసం రెండింటిని వృద్ధులు, మహిళలు, అణగారిన వర్గాల సంక్షేమంపై చర్చించేందుకు కేటాయించాలి. సమావేశాల్లో గ్రామాల్లో ఆయా వర్గాల సంక్షేమంపై ప్రణాళిక రూపొందించుకుని పాలకవర్గ ఆమోదంతో ముందుకు వెళ్లాలి.

### సర్పంచ్ హక్కులు.. ఖర్చులు

పంచాయతీ రికార్డుల తనిఖీ, కార్యదర్శి పనితీరుపై పర్యవేక్షణ, అధికారుల నుంచి సమాచారం కోరే హక్కు సర్పంచ్‌కు ఉంటుంది. గ్రామ పరిధిలో వాణిజ్య సముదాయాల నిర్మాణం వంటి చర్యల ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర నిధులను తీర్మానాల ప్రకారం అభివృద్ధి పనులకు వెచ్చించాలి. ముఖ్యంగా భూసారం, కాలానికి అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై రైతుల్లో అవగాహన కల్పించాలి.

### అత్యవసర వేళ.. అపరిమిత అధికారాలు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో సర్పంచ్‌కు ప్రత్యేక విచక్షణాధికారాలు ఉంటాయి. భూకంపాలు, వరదలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు లేదా అంటువ్యాధులు ప్రబలినప్పుడు తక్షణ నిర్ణయాలు తీసుకునే అధికారం వీరికి ఉంటుంది.

### వార్డు సభ్యులు.. ప్రజల గొంతుకలు

వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డు సభ్యులు పనిచేయాల్సి ఉంటుంది. ప్రతి పంచాయతీ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలి. సమావేశానికి రెండు రోజుల ముందే వార్డులోని ప్రజావసరాలను గుర్తించి, సభలో చర్చించాలి. ఎజెండాపై పూర్తి అవగాహనతో చర్చల్లో పాల్గొని, గ్రామసభల్లో తమ అభిప్రాయాలను బలంగా వినిపించాల్సి ఉంటుంది.

## ముప్కాల్ నూతన సర్పంచ్ దంపతులకు ఘన సన్మానం



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ సర్పంచ్‌గా ఎన్నికైన కొమ్ముల సాయవ్వ-శ్రీనివాస్ దంపతులను శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు సబ్సిడీపై రుణాలు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని 18 నుంచి 55ఏళ్లలోపు ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి నిమిత్తం సబ్సిడీపై రుణాలు అందజేయనున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి రసూల్ బీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వంద శాతం సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. లింగమార్పిడి గల వ్యక్తులకు రూ.75 వేలకు మించకుండా మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి పదిరోజుల్లోపు అన్ని ధ్రువపత్రాలతో కలెక్టరేట్ లోని మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ (రూమ్ నం.17) కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## పని ఒత్తిడితో బ్యాంకు ఉద్యోగి బలవన్మరణం

**అక్షరటుడే, బాన్సువాడ:** పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురైన బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహమ్మద్‌నగర్‌లో చేటు చేసుకుంది. సీఐ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం.. మహమ్మద్ నగర్ యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా కస్తూరి సంగమేశ్వర్ పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆయన పనిఒత్తిడి కారణంగా మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రోజు మాదిరిగానే విధులకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. చివరకు బాన్సువాడ మండలం మొగులాన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం: ఏసీపీ శ్రీనివాస్

**అక్షరటుడే, బోధన్ :** క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బోధన్ పట్టణ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో మైనారిటీ సొసైటీ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ సొసైటీ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులురాలు పద్మజ, పీఈటీ గీత, తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ నివారణపై విద్యార్థినుల ప్రతిజ్ఞ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాన్సర్ నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పాఠశాల ప్రారంభమైన తర్వాత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. టాస్క్, బసవతారకం సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్‌పై విద్యార్థులకు సమగ్రమైన అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటూ, శారీరక వ్యాయామం చేస్తూ, హానికరమైన అలవాట్లకు దూరంగా ఉంటూ, సమతుల్యమైన ఒత్తిడి లేని జీవన విధానాన్ని అనుసరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రిక, అధ్యాపకులు పాల్గొన్నారు.




## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** బంగ్లాపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని లింగంపేట్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మోహని (25) ఇంట్లో దుస్తులు ఉతికిన అనంతరం బంగ్లాపై వాటిని ఆరేసేందుకు వెళ్లింది. అక్కడ దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి ఆమెకు షాక్ కొట్టింది. ఈ క్రమంలో ఆమె కిందపడిపోగా గుర్తించిన కుటుంబీకులు హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

## జాతీయ అర్చరీ బృందానికి సన్మానం

**అక్షరటుడే, దోమకొండ :** మండల కేంద్రంలోని గడీకోటలో జార్ఖండ్ మాజీ సీఎం, జాతీయ అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు అర్జున్ ముండాను కామారెడ్డి జిల్లా అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ సన్మానించారు. హైదరాబాద్‌లో అర్చరీ జాతీయ పోటీలు ముగియగా జాతీయ అర్చరీ డైరెక్టర్ ప్రీమిలేయర్ కామినేని అనిల్‌కుమార్ ఆహ్వానం మేరకు అర్జున్ ముండా, తదితర సంఘం సభ్యులు దోమకొండ గడీకోటకు విచ్చేశారు. కోటలోనే గురువారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని కలుసుకున్న మాజీ జడ్పీటీసీ, జిల్లా అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్ గౌడ్ సన్మానించారు. మాజీ సీఎం అర్జున్ ముండా దంపతులతో పాటు జాతీయ అర్చరీ డైరెక్టర్ ప్రీమిలేయర్ కామినేని అనిల్ కుమార్, జాతీయ అర్చరీ కమిటీ ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, గురుం, కోశాధికారి జోరిస్ పాల్, సుమంత్ మహతి, అరవింద్, ఒలింపిక్ ఛాంపియన్ ప్లేయర్ డోలా బెనర్జీ తదితరులున్నారు.



## ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

**అక్షరటుడే, బోధన్:** ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బోధన్ మండలం కల్దుర్కి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంజీర నుంచి ఇసుకను తీసుకొస్తున్న ఓ ట్రాక్టర్ కల్దుర్కి శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాము అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై మచ్చేందర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎల్లారెడ్డిలో బంద్ ప్రశాంతం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డిలో విపక్షనాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. సోమార్‌పేట్‌లో ఈనెల 15న జరిగిన ఘటనలో పోలీసుల తీరుకు నిరసనగా శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పట్టణంలోని వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాయి. విపక్ష నాయకులు, సోమార్‌పేట్ గ్రామస్థులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ బంద్‌కు మద్దతు పల కాలని కోరారు. ఈ సందర్భంగా విపక్ష నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటలో సర్పంచ్ ఎన్నికల అనంతరం సర్పంచ్ కురుమ పాపయ్య తమ్ముడు కురుమ చిరంజీవి.. సర్పంచ్‌గా ఓడిపోయిన అభ్యర్థి బిట్ల బాలరాజు కుటుంబ సభ్యులపై దాడి చేశారన్నారు. అకారణంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టిన ఘటనలో కేవలం చిరంజీవి మీద మాత్రమే పోలీసులు కేసు నమోదు చేసి మిగతా వారిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ట్రాక్టర్ ఘటనకు ప్రేరేపించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబాతో పాటు ఇతర వ్యక్తులపై సైతం కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమార్‌పేట్ ఘటనలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే పూర్తి వైద్య ఖర్చులు భరించాలని విపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బాధితులు త్వరగా కోలుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.